# నా తమాషా పెళ్లి

కుమారి ఏ. వి. రమణ

కాలేజీ నుంచి యింటికి వచ్చేటప్పటికి మా అమ్మ ఎందుకో ఏడుస్తోంది. వేగంగా కొట్టుకొనే గుండెలతో వెళ్లి అమ్మ మంచం మీద చతికిలబడి "ఎందుకే అమ్మా" అన్నా ఆదుర్దాగా—కళ్లు తుడుచుకొని నా ముఖంలోకి చూస్తూ "ఎందుకేమిటి తల్లీ నీ పెళ్లి చెయ్యలేక పోతున్నా ననే ఏడుస్తున్నాను"

"అందు కింత విచారించడం ఎందుకమ్మా? టైమ్‌వస్తే అదే అవుతుంది"

"వెఱ్ఱి తల్లీ! నీ కేం తెలుసూ? ఓ చెంపకొడితే నీళ్లు మరో చెంపకొడితే పాలు. నిన్నూ నన్నూ దిక్కులేని వారిగా చేసి ఏ నాడో నీ తండ్రి చనిపోయారు. ఆయనే వుంటే నా కింత బెంగ ఎందుకు? ఊళ్లో చూస్తేనా—పేళ్లు పెడుతున్నారు. ఏదో ఒక సంబంధం చేసేద్దామా అంటే కట్నం పిశాచం కుదరనియ్యడంలేదు. అయిదువేలు ఇస్తే కాని వద్దని పదివేలు అయితే కాని చాలవని. ఇదీవరస. ఈ బెంగ నన్ను మంచ మెక్కించేలావుంది" ఇలా అని ఆయాసంతో ఇక చెప్పలేక ఆగిపోయింది. ఆ ముసలి ప్రాణి పడేవ్యధ చూడ లేక పోయాను. నా కన్నులలో నీరు నిండింది. కష్టంమీద ఆపు కొన్నాను. ఈ కాలంలో అన్నింటికి కరువు వచ్చినట్లే పెళ్లి కొడుకులకీ వచ్చింది. అన్ని ధరల కంటే పెరిగి పోయింది వీరి ధర. ఆడ పిల్లల్ని గన్న తలిదండ్రులపాట్లు దైవానికే తెలియాలి. వారు ఎవరితో మొర పెట్టు కుంటారు? ఏ దేముడు వింటాడు? ఏ ప్రభుత్వం వింటుందీ? ఎవరి మీద సమ్మె చెయ్యడం? ఆ కట్నాలు పుచ్చుకొనే వారు మానవులు కాదేమో. వారికీ ఆడపిల్లలు వుంటారు. కాని పుచ్చుకొనేటప్పుడు పైసా అయినా తగ్గించరు. నేటి యువకులు విద్యావంతులు అయివుండీకూడ కొంత మంది కట్నాలకోసం భీష్మించుకుని కూర్చుంటున్నారు. పోనీ ఇచ్చేది పుచ్చుకోవడం కాదు. పెద్దరేటు వేలుమీద ఖండించి పుచ్చుకోడం కూడాను. అబ్బా! అమ్మ ఎక్కడ తెస్తుంది? ఎప్పుడో అవుతుంది ఊరుకోవే అంటే వినదు. ఈ బెంగతో ఈ ప్రాణి అస్తమిస్తే నాకు దిక్కెవరు? ఈ ఆలోచనలలో నా బుఱ్ఱ వేడెక్కిపోయింది. ఆ వేడిలోనే ఒక వుపాయం తట్టింది. "అమ్మా నువ్వు విచారించకు. ఈ సారి నేనే వెడతాను" అన్నా.

ఈ మాటకు మా అమ్మ నవ్వింది నీ పెండ్లి సంబంధాలకు నీవు వెళ్లడంటే? అంతా నవ్వరూ? అయ్యో" అంది. "నేనెలా వెడతానో చూద్దువుగాని నువ్వేమి అడ్డుచెప్పకు" అని కొన్ని సంబంధాల వివరాలు తెలుసుకొని ఆ మరునాడే బయలు వెళ్లడానికి నిశ్చయించుకొన్నా......

బండి దిగి మెట్లెక్కుతుంటే శాస్త్రిగారు ఇవతలికివచ్చి "ఏ వూరు నాయనా మా అబ్బాయికోసం వచ్చావా?" అని నన్ను లోపలికి తీసుకు వెళ్లాడు. ముందు హాల్లోనే కూర్చు కూర్చున్నాము. "నీ పేరు" అన్నారు. తడుముకోకుండనే రాజా అని చెప్పాను. ఆయన నాకేసి పరిశీలనగా చూస్తూంటే నాకు కొంచెం అధైర్యంతోచింది. "ఏం చదువుకున్నావు?" అన్నారు. "ఇంటర్ సీనియర్." అని జవాబు చెప్పా. ఇలాగే మామూలు కుశల ప్రశ్నలు అయిన అనంతరం "మా పిన్ని నన్ను వెళ్లమని మరీ మరీ బలవతం చేస్తే వచ్చాను. పిల్ల బాగుంటుంది నా క్లాసే—కొద్దిగా సంగీతం కూడ వచ్చు. మీరు స్వయంగా వచ్చి చూసుకొని నచ్చితేనే చేసుకోండి" అన్నా.

"అబ్బే మా వాడు పెళ్లి చేసుకోనని పేచీ పెడు తున్నాడు. ఎప్పుడో తన ఇష్టం వచ్చినప్పుడు చేసుకుంటా డట. ఇప్పటి కుఱ్ఱకారంతా కొంచెం ఇంచుమించు ఇంతేగా" అన్నాడు శాస్త్రిగారు.

"అబ్బే అలా అనకండి. పెద్దలు మీరు చెబితే వినకుండా వుంటాడా? ఏదో అలా అనడమే కాని పెద్దల ఇష్ట ప్రకా

రమే జరుగుతున్నాయి చాలా పెళ్లిళ్లు. కట్నం కానుకలు బాగుగానే జరుపుతుంది మా పిన్ని" అన్నాను.

"అహా. దానికిగాదబ్బాయ్. అయితే కట్నం ఎంతవరకు ఇయ్యాలనుకుంటున్నారు? పదివేలకీ ఒక కానీ తగ్గితే చేసుకోనంటున్నాడు మా వాడు" అన్నాడాయన.

"అంత కట్నం ఇచ్చుకోవడం కన్న వాంకి కష్టంగా వుంటుంది. ఏదో కొంచెం."

"నా మాట వినడని ముందే చెప్పానుగా నాయనా—వాడి అభిప్రాయం చెప్పాను. మాకేం కావాలీ? బోలెడు ఆస్తి. వాడు వద్దంటే మాకేం? అంతా వాడి ఇష్టమే కదా" ఆయన ధోరణి ఇలా పోతుంది. అమ్మయో. పదివేలు అమ్మ ఎక్కడ తేగలదూ? ఇల్లు అమ్మినా రాదే. అయ్యో! దేముడా! ఆడపిల్లల పెళ్లికి ఎంత బెడద తెచ్చి పెట్టావూ? సరే పిల్లని చూసుకోండి. కట్నాల మాట తరువాత మాట్లాడుకుందాము" అన్నా.

"అప్పే ముందరే కట్నాలకానుకలు కుదుర్చుకోవాలి" అన్నాడు. నాకు చాల కోపం వచ్చింది. ఏం చెయ్యగలనూ సరే పదివేలూ ఇస్తాం మంచిరోజు చూసుకుని రండి అన్నాను. ఆయన ముఖం అప్పుడు చూడాలి.

"ఆలాగే నాయనా! మీ పిన్నిగారితో ఆలోచించ వద్దూ"

"అన్నీ ఆలోచించే వచ్చానండి" అన్నాను. ఆ తరువాత వాళ్లబ్బాయిని తీసుకువచ్చి చూపించాడు. పేరు వాసుట. అతన్ని చూస్తే మరింత మతిపోతుంది. ఈయనకీ వాసుకీ పోలికేలేదు. స్ఫురద్రూపి. అతి విశాల ఫాలభాగం. విశాలమైన కన్నులు. అతని విశాల హృదయాన్ని చాటుతున్నాయి ఆ కళ్లు.

ఇంతలో ఆ హాలులో విద్యు ద్దీపాలన్నీ ఒక్కసారి వెలిగాయి. ఉలిక్కిపడి లేచి సరే వెళ్లి వస్తానండి మీరు తప్పక రండి అన్నాను. అప్పే ఈ రాత్రి ఎక్కడికి వెడతావు భోజనం చేసి విశ్రమించి ఉదయం వెళుదువు గాని అని బలవతం చేసాడు. వుంటే లాభం లేదని "అప్పే వెళ్లి పోవాలండి" అని రెండు అడుగులు వేసాను. ఆయన అడ్డువచ్చి చేతులు పట్టుకొన్నాడు. నా చేతుల ద్వారా నా రహస్యం ఎక్కడ తెలిసిపోతుందో అని విదలించుకొని వచ్చి కూర్చున్నాను. అక్కడ వుండటం ఎంత మాత్రం ఇష్టంలేదు. ఒక్క నిముషం ఆలోచించి—ఆరోగ్యం సరిలేని మూలంగా ఒంటిపూటే భోజనం చేస్తున్నానండి అని తప్పించుకొన్నాను. పోని కాఫీ ఫలహారాలు తీసుకుందురుగాని" అని అక్కడే నించున్న నౌకరునితో "ఒరే వెంకా! అబ్బాయిగారి గదిలోనే ఈయనకు ప్రక్క వేసిరా—వాసూ పైకి తీసుకువెళ్లు. అన్నీ పైకే పంపిస్తా" అని లోపలికి వెళ్లిపోయాడు. నా బట్టల బ్యాగ్ పట్టుకొని వాసు వెనకాలే వెళ్లాను. వాస గది అందంగా వుంది. సోఫాలో చతికలపడ్డాను. నా ప్రక్కనే కూర్చున్నాడు వాసు. అతనికి తెలియకుండా కొద్దిగా ఎడం జరిగాను. వాసు నాకేసి అనుమానంగా చూస్తూన్నాడు. నా జుట్టువైపే వుంది అతని దృష్టి. అది గ్రహించి "తిరుపతి మొక్కువుంది లెండి" అన్నా నవ్వుతూ. అతనూ నవ్వాడు. ఫలహారాలు కాఫీ తెచ్చి మా ముందు టేబిల్ మీద పెట్టి వెళ్లిపోయాడు వంటాయన.

నా మనస్సు చెదరి పోయింది. నా చూపులు బెదరుతున్నాయి. ఆకలి వేస్తూన్నా తినలేకపోయాను మొగమోటం కొద్ది. మా ఇద్దరికి ఈ క్రింది సంభాషణ జరిగింది.

"మిమ్మల్ని ఒక ప్రశ్న వేస్తాను. చనువుగా ఇలా అడుగుతున్నందుకు ఏమి అనుకోకుండా జవాబు చెబుతారా" అన్నాను. "ఊ" అన్నాడు వాసు.

"వివాహం విషయంలో మీ అభిప్రాయం మీ ఆశయాలు చెబుతారా?"

"చెప్పినా ప్రయోజనం వుండదు. నా ఆశయాలు ఆశలు ఎలా వుంటేం, అవి నెరవేరనప్పుడు?"

"అలా కాదు. ఊరికే తెలుసుకుందామనే అడుగుతున్నాను."

"అయితే వినండి చెబుతాను."

"అండీ, గిండీ వద్దు. నేను మీ కంటె చిన్న వాణ్ణికదా? రాజా అందురూ చాలు."

# నా తమాషా పెళ్లి

"పోనీ అలాగే అంటూ. అసలు సంగతి నాకు కట్నం అంటే తగని మంట. ఒక్క కానీ అయినా కట్నంగా తీసుకోవడం నాకు యిష్టంకాదు. ఇంకా వీలైతే ఒక నిరుపేద కుటుంబానికి చెందిన పిల్లని పెళ్లాడడం నా కోరిక. అటువంటి నిరుపేద హృదయాలలో అమృతం దొరుకుతుంది. పైగా ఆ కుటుంబం పేదరికంనుంచి విముక్తి పొందుతుందికూడా. ఒక కుటుంబం దీని మూలంగా సుఖపడుతుంది. మన మనస్సులకూ తృప్తి కలుగుతుంది. వారికీ ఉపకారం జరుగుతుంది. స్త్రీలు కూడా అలా చేస్తేనే బాగుంటుంది. ఒక భాగ్యవంతుల పిల్ల నిరుపేద విద్యార్థిని పెళ్లి చేసుకోవాలి. స్త్రీలు పురుషులుకూడా ఇలా చేస్తే అనేక అమాయిక హృదయాలు ఆనందిస్తాయి. అంతే కాని భాగ్యవంతుల సంబంధాలకు భాగ్యవంతులే ఎగబడితే రెండు ఓడలు ఏటిలో ఢీకొన్నట్లు వుంటుంది. ఇదీ నా ఆశయం."

"మంచి ఆశయమే. మీ అభిప్రాయం నాకు బాగా నచ్చింది. ఈ మహదాశయాలకు మీకు పదివేల నమస్కారాలు చేస్తున్నాను."

"ఏం ప్రయోజనం రాజా! నా ఆశయాలకు నా జీవితానికీ పొందిక లేదు."

"మీ నాయనగారు మా అబ్బాయి పదివేలకు కానీ తక్కువ కట్నమైనా ఒప్పుకోడు అన్నారే."

"చెబుతున్నాగా, ఆయన పన్నాగమే ఇదంతా. ఆయన స్థితిలోనివారు ఎవరైనా సరే ఇలాగే అంటారు. ఇందుకే మేనరికం చెడిపోయింది. మా నాన్నకు తెలియకుండా పదివేలు నేను మా అమ్మ రహస్యంగా సర్దుబాటుచేద్దామనుకొన్నాం. ఆయనోతిక్కశంకరయ్య, ఒప్పుకొన్నాడు కాదు. పై సంబంధం చూసి చేసుకొన్నాడు కూతురికి."

"అలా అయితే డబ్బు పెత్తనం అంతా మీదేనా వాసుగారూ!"

"ఆహా! ఇవిగో తాళం చెవులు. ఇనప్పెట్టిలో ఎంత డబ్బుందో ఏ మైందో అదేమీ లెఖచూడడు మా నాన్న. అంతా నా పెత్తనమే. నేను చాలా జాగ్రత్తగా వుంటానని ఆయన నమ్మకం."

"పోనీ మీదే రహస్యంగా పదివేలు తీసి ఒక నిరుపేద కుటుంబానికిచ్చి, ఆ పేద పిల్లని పెళ్లాడి ఆ కుటుంబాన్ని ఉద్ధరించకూడదూ?"

"ఎందుకు కూడదు? అలాంటిది ఇంతవరకు ఏదీ తటస్థపడనే లేదు. ఇంతలో నువ్వువచ్చి పుసుక్కున పదివేలు ఇస్తామని ఒప్పేసుకున్నావు."

"పోనీ ఇప్పుడైతేం మించిపోయిందేమీ లేదు. మీరు అలా చేస్తే మా పిన్ని ఎంతో సంతోషిస్తుంది. ఆమెకు భర్తలేడు. మా సరోజ చాలా బాగుంటుంది. మాతోపాటే చదువుకుంటోంది. ఈ కట్నాల బాధ ఎలాభరించడమా అని మా పిన్నీ అదీ కూడా కుమిలిపోతున్నారు. చాలా పేద కుటుంబం."

"అలాగే చేస్తాను. పిల్లను చూడనీ."

"పిల్ల అచ్చంగా నాలాగే వుంటుంది. ఏమీ తేడా లేదు. మేం ఇద్దరం కవల పిల్లలం అనుకుంటూవుంటారు చూసిన వాళ్లంతా. నన్ను చూస్తేనే చాలు దాన్ని వేరే చూడ నక్కరలేదు."

"నాకేమో నీ వరసంతా అనుమానంగావుంది. ఏమీ పాలుపోవడం లేదు. నీ చేతులు నీ కంఠస్వరం......"

"పోనీ! నేనే సరోజనై వుంటే..."

"ఆఁ! దొంగ దొరికిపోయింది......" అని పక్కున నవ్వాడు. ఒక్క నిమిషం ఆగి "ఎంత సాహసం?" అన్నాడు.

అతని ముఖం సంతోషంతో వికసించింది.

"నేను ముందే అనుకున్నాను. వేషం ఎంత కనుగప్పినా కంఠం, నడక, చేతుల సౌకుమార్యం ఇవి అన్నీ ఏమౌతాయి. రా సరోజా! ఇప్పుడే ఆ డబ్బు ఇస్తాను తీసుకో." అని ప్రక్క గదిలోని ఇనప్పెట్టె దగ్గరకు తీసుకు పోయి పదివేల రూపాయల నోట్లు తీసి నా బాగ్‌లో సర్దాడు. ఇద్దరం

తిరిగి రాగానే "ఇదిగో, కాఫీ ఇంకా త్రాగనేలేదే నువ్వు, త్రాగు" అని కప్పు నోటి కందించాడు.

"అప్పుడేనా ఇంత దయ?" అన్నా.

"ఇప్పుడే కాదు ఇది ఆ జన్మాంతం వుండిపోయే దయే."

"నీలాంటి ఉదార హృదయులైన యువకులుంటే ఈ వరకట్న పిశాచం రూపుమాసి వుండేది గదా."

"అవును సరోజా! దేశంలో ఎన్నో కుటుంబాలు దీని వల్ల ధ్వంసమైపోతున్నాయి. అయితే నీ పెళ్లికోసం నువ్వే సంబంధాలను అన్వేషించుకోవలసిన పనేంవచ్చింది?"

"అదంతా చాలా పెద్ద విషాద గాథ! తరవాత చెబుతానులెండి."

కాఫీ ముగించి తమల పాకులు వేసుకొన్నాక "పాపం అలిసి పోయినట్లున్నావు. ఆ మంచంమీద పడుకుని నిద్రపో" అన్నాడు వాసు.

నా మంచం మీద నడుంవాల్చానే గానే నిద్రపట్టలా, పెదవులకు విరామ మిచ్చామే గాని మా కళ్లే సంభాషణ మొదలు పెట్టాయి. ఎన్నో మధుర భావాలు, సుందర స్వప్నాలు వాసు కళ్లలో మెరుస్తున్నాయి. నాకు తెలియకుండానే అతని రూపాన్ని చూస్తూ ఎంత సేపు గడిపానో. నాకు తెలియకుండానే రెప్పలు మూతపడ్డాయి.

* * *

"సరోజా సరోజా" అన్న పిలుపు విని ఉలికిపడి లేచాను.

వాసు నా మంచందగ్గర నిలబడివున్నాడు.

"తెల్లవార వచ్చింది. స్నానం చేద్దువుగాని రా" అన్నాడు.

స్నానం చేసి, మళ్లా మామూలు మగ వేషంలో తయారైనాను.

"కాఫీ త్రాగు సరోజా" అని కప్పు నిండా కాఫీ తెచ్చి నా ముందుంచాడు.

"సరోజా అని పిలవకండి. మీ నాయన వింటే కొంప మునుగుతుంది" అన్నాను.

ఆ తర్వాత వాళ్ల నాయనతో పిల్లని చూసుకొనడానికీ త్వరలోనే మీ అబ్బాయిని పంపమని చెప్పి మా వూరుకు బయలు దేరాను.

ఇంటికి వెళ్లి మా అమ్మకు జరిగిందంతా చెప్పాను. ఆమె సంతోషంతో పొంగిపోయింది. "దిక్కులేని వారికి దేముడే దిక్కు. నాకు ఆడపిల్లవైనా మగపిల్లవాడు లేని లోటు తీర్చావు" అంది.

అనుకున్న ప్రకారం మగ పెళ్లివారు వచ్చారు. సరే అన్నారు. నా పెళ్లి సలక్షణంగా జరిగిపోయింది. ఈ తమాషా పెళ్లిమాట తలచుకొని నేను, వాసూకూడా అప్పుడప్పుడు నవ్వుకుంటూవుంటాం.

ఇంతకీ యుక్త వయస్సు వచ్చాక యువతీయువకులు తమ వివాహం విషయమై తామే బాధ్యతవహించి, వారిలో వారు ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని పెళ్లి స్థిరపరుచుకోవాలి. ఈ విషయాన్ని పెద్దలు పూర్తిగా గ్రహించాలి. అలా జరగని పక్షంలో యావజ్జీవిత సౌఖ్యానికి సంబంధించిన ఈ ముఖ్య విషయం ఎన్నో చిక్కులకు దారి తీస్తుంది. ఎందరి జీవితాలో ఈ విషయాన్ని తలిదండ్రులు సక్రమంగా సహృదయంతో గ్రహించకపోవడంవల్ల దుఃఖభాజనమై పోతున్నాయి. ఇది నిజమంటారా?

